# మాయ - మహామాయ

*(బ్లేడు యుద్ధాల గురించి విన్నారా? అణుబాంబులూ, ఉదజని బాంబులూ, రసాయనిక బాంబులూ వేసుకుని కొట్టుకునే కాలంలో బ్లేడుల్తో యుద్ధాలా? అంటూ విడ్డూరపడుతున్నారా? అబ్బెబ్బే! అంత చిట్టిపొట్టి సామగ్రితో యుద్ధమాడుకునేంత యోగ్యుడు కాదు నేటి మానవుడు. ఆ మాట నేనూఒప్పుకుంటాను. కథలో దిగితే మీకూ తెలుస్తుంది గదా!)*

మరకతం అనే ఆయన భారతదేశానికి బ్లేడులు అందించే పరిశ్రమలో ప్రథముడు. ఆయన సరుకు అనేక నామధేయాలతో మార్కెట్లో దిగుతుంది. వారి కొత్త బ్లేడు పాత బ్లేడుకన్నా మహత్తరమయినదని వాళ్లే మనం కొనుక్కున్న టివిలో నమ్మజూపుతారు.

మరకతం బ్లేడుల్తోనే మగవాడు పొద్దుటే నిద్దర లేస్తాడట. లేస్తూనే గడ్డం గీస్తాడట. గీస్తూనే నవనవోత్సాహంతో చిందులు వేస్తాడట. ఈ టీవీ ప్రకటన చూసిన ఓ ముద్దరాలు నిద్దట్లో ఉన్న మొగుడికి గెడ్డం గియ్యబోయిందట. ఆమె ప్రయోగం ఆమె విజ్ఞానానికి దర్పణమా! అనురాగ సమర్పణమా! అన్న విచక్షణ లేకుండా రక్తం చిమ్ముతున్న మొద్దు మొగుడు ఆ ముద్దరాలి మీద ఎగిరాడట. ఈవిధమయిన కథలు మరకతం వారి ప్రకటనల మీద ప్రచారంలో ఉన్నాయి. ప్రచారమనేది ఎలాంటిదయినా వస్తువు వాడకానికి నిదర్శనం కదా! అందువల్ల మరకతం వారి బ్లేడు గడ్డాలను తొలగించినా, మానినా, మార్కెట్ అడ్డాలను తొలగించుకుని

ముందుకు పోతూ ఉంది.

సరిగ్గా ఇలాంటి సునాయాస ప్రయాణంలో తమ అమ్మకాల గ్రాఫ్ కిందకి వంగిపోవడం మరకతం పరిశ్రమలో పెద్దదిక్కు కంటపడింది. ఆయన నిద్ర చెడింది. వెంటనే తన చిన్న దిక్కులని పిలిచి కారణమేంటన్నాడు.

''యువతరానికి గడ్డం పెంచడం ఫ్యాషనయ్యుంటుంది'' అన్నాడొక చిన్నదిక్కు.

''సైన్యానికి, పోలీసులకి మరింత భీకరంగా కనిపించడానికి గడ్డాలు, మీసాలు పెంచమని ఆర్డరేసి ఉంటారు'' అన్నాడొకరు.

''భక్తి పెరిగింది. మొక్కులు పెరిగాయి. ఇది దేశ ప్రగతికి నిదర్శనం'' అన్నాడింకొకడు.

ఇలా వాళ్లు చెప్పిన కారణాలన్నీ కొట్టిపారేశాడు పెద్దదిక్కు. కొట్టేసినవాడు మరీ పెద్దవాడు గనక చిన్నదిక్కులకు యిగో సమస్యలు రాలేదు.

''అమ్ముడవుతున్న ప్రతి పదింటిలోనూ తొమ్మిది మావేనని ఇన్నాళ్లూ బోరవిడుచుకు తిరిగాం. ఇప్పుడు మన నడుం విరిగేట్టుంది. వెళ్లి కారణాలు కనిపెట్టండి. వ్యాపార నిర్వహణలో మీ డిగ్రీలెందుకున్నాయో చూపించండి'' అంటూ పురమాయించాడు.

సులువుగానే తెలిసిపోయింది. మాణిక్యం వారి అమ్మకాల గ్రాఫ్ సగర్వంగా పైకి లేస్తూంటే మరకతం వారి గ్రాఫ్ కిందకి వంగిపోతోంది.

''ఎవడీ మాణిక్యం...''

''పక్కా దేశవాళీయే''

''ఏ అంతర్జాతీయ సాంకేతిక విజ్ఞానమయినా కొన్నాడా?''

''లేదు''

అయినా వాడు చేసే బ్లేడు చవకకి చవకగానూ ఉంది. ( భారత వాడకందారుడికి వెలే ముఖ్యం గుణం కాదు. ప్చ్..) పంచిపెట్టేవాడికి వాటిని అమ్మిపెట్టేవాడికి ముట్టేది జాస్తిగానూ ఉంది. కొనుక్కున్న వాడికి కూడా అయిదో గడ్డం వరకూ మండకుండా గీస్తోంది.

ఈ ఆరాలు సాగుతూండగానే వారి అమ్మకాల గ్రాఫ్ మరింత తల దించేసుకుంది. అప్పుడు వాళ్లంతా కలిసి పెద్దదిక్కు ముందు తలదించుకు నిలబడ్డారు.

మీటింగ్ మొదలయింది.

ప్రొడక్షనాయన లేచాడు.

''పెద్దదిక్కుగారూ! మన బ్లేడులని మరింత సానబట్టాలి. విదేశాలకు పోయి, కొత్త విజ్ఞానాన్ని తెచ్చుకునొద్దాం. నన్ను పంపండి'' అన్నాడు.

కులాసాగా వుంటే కులాసా యాత్రలకు తన పెద్ద ఉద్యోగులను పంపే రకమే పెద్దదిక్కు ఇప్పుడా మానవుడు కులాసాగా లేడు.

మార్కెట్బాయన లేచి ''వస్తువు నాణ్యత ఎట్లాంటిదయినా దాన్ని మార్కెట్టు చెయ్యాలి అదే సవాల్! వ్యాపార పరమపద సోపానంలో ప్రకటనలే అసలయిన నిచ్చెనలు. మనం నీదేవి చేత అడ్వర్టయిజ్మెంట్ మొదలెడదాం'' అన్నాడు.

నీదేవి ప్రస్తావనతో అందరి కళ్లూ మెరిశాయి.

ఆవిడ చలనచిత్ర సామ్రాజ్యానికి మకుటం లేని మహారాణిట.

''నీదేవి ఆడది గదండీ'' అని ఓ బడుద్దాయి అనుమానం వ్యక్తం చేశాడు,

ఆ బడుద్దాయి మీద అందరూ దాడిచేశారు. ''ఆడవారికి గెడ్డమూ, మీసమూ లేనంతమాత్రాన వారు గెడ్డమూ, మీసమూ గీసుకోకూడదా'' అని ఒకరు అన్నారు.

''హెల్మెట్ కంపెనీల వాళ్లు హెల్మెట్ని నిర్బంధంగా జనం చేత ధరింపజేయగలిగినప్పుడు మనమెందుకు ఆ పని చేయరాదు. గడ్డం మీసం గీసుకుంటే తప్ప స్త్రీలయినా, పురుషులయినా రోడ్డు మీదకు రారాదని ఏల చట్టం తెప్పించరాదూ?'' అని ఒకడు అన్నాడు.

''ఇదంతయూ ఆ భగవంతుని పక్షపాతము, హెల్మెట్ కంపెనీల వారి లాభము కొరకు ప్రతి ఒక్కరికీ తలలనిచ్చిన ఆ మహిమాన్వితుడు, దానిని నిర్బంధముగా చేయుటకు ప్రభుత్వమనే వరాన్ని ఇచ్చిన ఆ పరంధాముడు మన బ్లేడు కంపెనీల వారి లాభాలను కోసి వేయుటకే గదా! స్త్రీలకు గడ్డమూ, మీసమూ ఇవ్వలేదు, కటకటా!'' అని ఒకరు వాపోయారు.

ఇలా అందరూ బాధపడుతుండగా మార్కెట్బాయిన సర్ది చెప్పటానికి అన్నాడు.

''ఎవరు వాడే వస్తువులకు వారే ప్రకటనలనివ్వాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి వారి నిబంధన లేదు గదా?''

భగవంతుని కన్నా బలమయిన అంతర్జాతీయ ద్రవ్యనిధి ఈ విషయంలో తమకు అనుకూలంగా ఉన్నందుకు తతిమ్మా చిన్నదిక్కులంతా సంతోషించారు.

'నీదేవి' ఐడియాకు పెద్ద దిక్కు అంగీకరించడంతో మీటింగ్ ముగిసింది.

వారం తిరగకుండా టీవీలో నీదేవి పాల్గొన్న ప్రకటన ఉధృతంగా మొదలయింది. ప్రియుని పట్ల అయిష్టతతో ముఖం పక్కకు తిప్పుకుంటుంది నీదేవి.

''ఆమె అలకకి కారణం నీ సగం సగం గడ్డం, వాడవోయి భారతీయుడా! మరకతాన్ని వాడవోయీ!'' అంటూ ఒక మిత్రుని సలహా. దాన్ని పాటించిన ప్రియుని కౌగిలిలో ఇమిడిపోతూ ''మా దాంపత్య విజయానికి కీలకం మరకతం వారి బ్లేడే'' అంటూ ముద్దుముద్దుగా చెపుతుంది నీదేవి.

మరకతం వారి ఆ ప్రకటనలో నీదేవిని తమ దేవిగా భావించుకుంటూ ఆ ప్రకటన వచ్చేముందే మాణిక్యం వారి బ్లేడుతో గడ్డం గీసుకుని, సెంటు రాసుకుని, టీవీముందు తయారయిపోసాగారు జనాలు.

''అకటా! నా సారా తాగి అప్పొజిషనోడికి ఓటేసేశారే జనం'' అంటూ వాపోయే రాజకీయ నాయకుడిలా కృంగిపోయాడు పెద్దదిక్కు.

మళ్లీ మీటింగ్ మొదలయింది.

ప్రొడక్షనాయనని నోరు విప్పనీలేదు మార్కెటింగాయన. ''బ్లేళ్ల పాకెట్టుతోపాటు రేజర్‌ని ఉచితంగా ఇద్దాం'' అన్నాడు.

''చేసేవాడిని నేను, అమ్మేవాడివి నువ్వూ. నువ్వు నన్ను కికురించెదవా?'' అని ప్రొడక్షనాయన ఆగ్రహంతో ఉన్నాడు. దాంతో తిరగబడిపోయాడు.

''నీ సంత (మార్కెట్) తెలివి తెల్లారినట్టు ఉంది. మా బ్లేడ్ కొనండి, మేమే గెడ్డం గీసిపెడతాం అను, ఇంకా బాగుంటుంది'' అన్నాడు.

ఆయన అలా అనగానే చిన్నదిక్కులు రెండు పక్షాలుగా విడిపోయి మాటలు విసురుకోసాగారు. ''వీళ్లని శాసనసభకి పంపితే, చెప్పులూ, మైకులూ లాంటి స్వల్ప వస్తు సముదాయాన్ని విడిచి, కత్తులూ కటారులూ పుచ్చుకుంటారు'' అనుకున్నాడు పెద్దదిక్కు.

''మీరు ఆలోచించనక్కరలేదు. నేను అడిగినవాటికి జవాబివ్వండి'' అంటూ ఆయన హూంకరించాడు. అంతా సద్దుమణిగారు.

''సరఫరాల పరిశ్రమ మన చెయ్యి తప్పిందా?''

''లేదుసార్, నెట్‌వర్క్ బానే ఉంది. రీటైల్ వాళ్లు మాణిక్యాలను పుష్ చేస్తున్నారు''.

''వీళ్లకి మాణిక్యం మంచి మార్జిన్ యిస్తున్నాడు''

''ఎలా ఇస్తున్నాడు?''

''మన వోవర్ హెడ్స్ ఎక్కువ. వాళ్లవి తక్కువ''.

''అవునవును, మీలాంటి పందికొక్కులకి పెర్క్స్ ఇస్తూ పోతూంటే వోవర్‌హెడ్స్ ఎందుకు పెరగవూ?'' అన్నట్టు చూశాడు పెద్దదిక్కు.

''భాగస్వామ్యముందని లాభాలూ గుంజుతావు. ఉద్యోగస్తుడినని జీతమూ లాక్కుంటావు. మాకిచ్చేదేముంది. నీకిచ్చే దానిముందు?'' అన్న తమ భావాలను దాచుకుంటూ వెర్రిచూపులు చూశారు చిన్నదిక్కులు.

''రిటైల్ వాళ్లని ఎలా ఆకట్టుకోవడం?'' అడిగాడు పెద్దదిక్కు.

మార్కెట్టాయన మళ్లీ పుంజుకున్నాడు ''వాళ్లకి నీదేవితో ఒక రాత్రి అని పోటీ పెడదాం'' అన్నాడు.

''ఆవిడ ఒప్పుకుంటుందా?'' మళ్లీ బడుద్దాయికి అనుమానం. తతిమ్మా చిన్నదిక్కులు మార్కెట్టాయన జవాబుకోసం ఆసక్తిగా చూశారు.

''దాందేముంది? ఆవిడ బంగ్లాలో ఓరోజు రాత్రి కాపలాకాసే అవకాశం మనం

కల్పిస్తాం, దానికి ఆవిడా ఒప్పుకుంటుంది. జనాలూ విరగబడతారు'' అన్నాడు.

పెద్దదిక్కుకి, ఆ అయిడియా పని చేసేటట్టే కనిపించింది. దాన్ని ఒప్పుకునేవాడే, అయ్యగారు అర్జంటుగా రమ్మనమని కబురంపాడు. ఎక్కడి మీటింగ్ అక్కడ వదిలేసి పెద్దదిక్కు పరుగెత్తాడు.

ఆర్తత్రాణ పరాయణుడయిన నారాయణులవారు అలనాడు గజేంద్రుల వారి మొర విని పరుగెత్తుతూ మందీ మార్బలాన్ని మరిచిపోయారుట. ఈనాడు పెద్దదిక్కు అలాంటి పనే చేశాడు. మరకతం గారి పిలుపులోని శక్తెనెరిగిన చిన్నదిక్కులు కూడా పెద్దదిక్కును వెన్నంటాయి.

''అయ్యవారు పూజలో ఉన్నారు'' అనేసి వరండాలో అందర్నీ నించో బెట్టేశాడు మరకతం గారి గృహ సహాయకుడు.

గంట తర్వాత వచ్చాడు మరకతం. ఆయన ప్రశాంత గంభీరంగా ఉన్నాడు. తను చంపి తిన్న లేడి ఆత్మశాంతి కోసమూ, ఆ పాప పరిహారం కోసమూ భగవంతుడిని వేడుకుని వేడుకుని వేడుకుని అలిసిపోయినట్టుగా ఉన్నాడు. ఆయన అద్దాల బీరువాలో ఉంచిన మృగం బొమ్మలా అందంగానూ, దాన్ని తెరిస్తే అది నిజం మృగమేనని తెలిసిపోయేంత క్రూరంగానూ ఉన్నాడు. ఒంటినిండా బూడిద పిండికట్లతో పవిత్రంగా కనిపిస్తున్నా సమీపంగా వేళ్లు పరిశీలిస్తే ఆ బూడిద మానవ కళేబరాలను కాల్చి చేసిందని తెలిసిపోయేంత భయానకంగా ఉన్నాడు.

మరకతం వచ్చి తన సిబ్బందిని పట్టు పురుగులను చూసినట్టు చూశాడు. చూసి, మేఘగంభీర స్వరంతో అడిగాడు.

''మాణిక్యం ఎవడు?''

అందరికీ నోరు తడారిపోయింది.

ఇన్నాళ్లూ తాము దాచిన ఈ రహస్యం కాస్తా ఎవరికి తెలియకూడదో వాళ్లకి, ఎలా తెలియకూడదో అలాగ తెలిసిపోయింది. కావాలని ఎవరూ దాచలేరు. తమ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఎవరూ తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం లేదు అన్నట్లు తలలు దించుకున్నారు.

పెద్దదిక్కే అన్నాడు, ''మా ప్రయత్నం మేం చేస్తూనే ఉన్నామయ్యా''.

''మీటింగులు! అవేనా మీ ప్రయత్నం''.

వారంతా నివ్వెరపోయారు. అంతకుమించి ఎవరు మాత్రం ఏం చేయగలరు?

''మీరు ప్రభుత్వోద్యోగులు కాదు. కనీసం ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు కూడా కాదు'' అన్నాడు మరకతం.

మీటింగులు వాళ్లే పెట్టుకుంటారనా! ఫలితాలు సాధించకపోయినా పదవులలో కొనసాగుతారనా! ఏమిటి ముసలాయన విసురు? అనుకున్నాడు పెద్దదిక్కు.

''మనం మాణిక్యాన్ని తొలగించాలి'' వాళ్లెలా భావించినా, తనకేం పట్టనట్టు మరకతం అన్నాడు.

ఆయన గొంతు గూండాలతో మాట్లాడుతున్న గూండా నాయకుని గొంతులా వాళ్లకి వినిపించింది. ఆయన గూండా నాయకుడయితే అవొచ్చుగాక తమని గూండాలుగా చూడడం పెద్దదిక్కుతో సహా ఎవరికీ నచ్చలేదు.

పెద్దదిక్కు చిన్నబోయిన మొహంతో అన్నాడు. ''కోర్టులున్నాయి. పోలీసులున్నారు. మనుషుల్ని తొలగిస్తే మన పనులు అవొచ్చు. అవతలాడు ఏ అనామకుడో అయితే వాళ్లు ఊరుకోవచ్చు. మాణిక్యం వంటి యువ పారిశ్రామికుడిని ముట్టుకుంటే ఊరుకోరు'' అలా పెద్దదిక్కు అన్నప్పటికీ ఆ మాట గొంతు దాటలేదు. అందుకు అతను ఆశ్చర్యపోతుండగా అతన్ని మరింత ఆశ్చర్యపరుస్తూ మరకతమే అన్నాడు.

''అందుకోసం మనం మాణిక్యాన్ని ప్రోత్సహించాలి. మానవుడు భగవత్సంకల్పానుసారం పుడతాడు. అయితే అతను అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపార స్వేచ్ఛానుసారం ఎదుగుతాడు. భగవంతుని దృష్టిలో అతని సృష్టి అంతా ఒక్కటేగదా! అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపార ధర్మంలో అందరూ సమానులేగదా! మరకతం ఎంతో మాణిక్యమూఅంతే. మరకతం కాస్త ముందు పుట్టాడు. కనక కాస్త ముందున్నాడు. మాణిక్యం కాస్త వెనక వచ్చాడు. కనక ముందుకు రావాలని చూస్తాడు. అది సృష్టి సహజం, ఎదుగుదల నైజం.''

''అవును సుమీ!''

నీవన్నది నిజం... నిజం అన్నట్లు చాలామంది చూశారు.

పెద్దదిక్కుతో సహా కొందరు మాత్రం ఆయన మొదటి మాటనూ, ఆ తర్వాత ఉపన్యాసాన్నీ సమన్వయించుకోలేక ఆశ్చర్యంలో కూరుకుపోయారు.

''మీరు వెంటనే వెళ్లండి. మాణిక్యం వారి బ్లేడులన్నింటినీ కొనెయ్యండి. నాలుగు నెలలపాటు మళ్లీ ఉత్పత్తినంతటినీ మన గోడౌన్లలో ఉంచండి''

ఆయన వెళ్లమన్నాక చిన్నదిక్కులందరూ వెళ్లిపోయారు. పెద్దదిక్కు మాత్రం ఆశ్చర్యంలోంచి లేవలేకపోయాడు.

ఆయన్ని లేపి, లోపలికి తీసుకెళ్లి, మంచినీళ్లు పట్టాడు మరకతం.

''ఏమిటి నీ సందేహం?'' అన్నాడు.

''అయ్యా! నేనూ మీ కుంటుంబంలో మనిషినే. ఈ పరిశ్రమలో నాకూ వాటా ఉంది. అయినా మీరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటానికి అందులో లాభాలున్నంతకాలమూ నాకు సమ్మతమే. పూజలూ, పునస్కారాల్లో పడిపోయి ధర్మబుద్ధిని పెంచేసుకోవడం, ఆ బుద్ధితో మాణిక్యంగాడి సరుకు అంతా తమరు కొనమనటం నాకు సమ్మతంగా లేదు. నాకు తెలిసి మీకు ఇంత ధర్మబుద్ధి పెరిగే అవకాశం ఏమీ కనిపించడం లేదు. కనుక మీ అంతరంగమేమిటో

నాకు తెలియాలి'' అన్నాడు పెద్దదిక్కు.

''నీకో తమాషా చెపుతాను. ఫ్యాక్టరీలను జాతీయం చేసేద్దామంటాడు కమ్యూనిస్టు. మార్కెట్లను అంతర్జాతీయం చేసేద్దామంటాడు కేపిటలిస్టు. ఇద్దరి సమానత్వాలలోనూ ఎవరిది పెద్దదంటావ్?'' అన్నాడు మందహాసంతో మరకతం.

అందులో తమాషా ఏదో ఉందనే అనిపించినా, మాణిక్యం వారి బ్లేడులన్నింటినీ కొనెయ్యమన్న పాలసీలోని కీలకమేమిటా అన్న ప్రశ్నలలోనే ఉండిపోయిన పెద్దదిక్కు అయోమయంగా తలాడించాడు.

మరకతం కొనసాగించాడు.

''మనం కేపిటలిస్టులం. కనుక కేపిటల్ పెట్టిన మనమందరం ఒక జట్టు. పదిహేను ఇరవై ఏళ్లబట్టి తింటున్న మనం నిన్నామొన్నా వచ్చినవాడూ సమానులం. కనుక వాడిని తిననివ్వాలి. అది ధర్మం. అలాగే వాడు మన తిండిలో జొరబడితే వానిని తప్పించడం మన ధర్మమే''.

''మీరా మాట అంటున్నారు. వ్యతిరేకమయిన పని చేస్తున్నారు.''

''మార్కెట్ సమానత్వ ప్రవక్తలంతా ఎవరు? ఈ బ్లేడు పరిశ్రమలో మనదేశంలో మనమెలా ముందున్నామో అలాగే వాళ్ల పరిశ్రమలో ముందున్న వాళ్లే. ఇతర దేశాల మార్కెట్లను అంతర్జాతీయం చేసెయ్యటానికే వాళ్లు ధర్మపన్నాలు పలుకుతారు. అంటే వాళ్లమాట ఒకటి, పని ఇంకొకటి. మనమూ అంతే.''

''అవును స్వామీ, అవును. మీ పరోపకారానికి ఈ వ్యాపారులకీ సంబంధం లేదు''.

''ఇంత చెప్పినా నా పరోపకారమే కనిపిస్తోందా పెద్దదిక్కూ?'' విచారంగా ప్రశ్నించాడు మరకతం.

''వ్యాపార నిర్వహణలో చాలా చదివాను. డిగ్రీ తీసుకున్నాను. ఎప్పటికప్పుడు లేటెస్ట్ మార్కెటింగ్ టెక్నిక్స్‌ని ఫాలో అవుతున్నాను. ఎదుటివాడి సరుకు కొనెయ్యటంలో టెక్నిక్కే నాకు కనిపించడం లేదు. కావాలంటే వాడి కంపెనీ టేకోవర్ టెక్నిక్ చెప్పగలను'' అన్నాడు పెద్దదిక్కు.

''నువ్వు అంత చదివావు గనకనే గోసాయి చిట్కాలు మరిచిపోయావు'' అన్నాడు మరకతం.

''అదేమిటో చెప్పేద్దురు బాబ్బాబూ'' అన్నాడు పెద్దదిక్కు నమ్మకంతోచి.

''మన గోడవున్లో వాళ్ల ప్రొడక్షన్ అంతా కొన్ని నెలలపాటు ఉంటుంది. మార్కెట్లో తాత్కాలికంగా వాళ్ల సరుకు ఉండదు. దాంతో మార్కెట్ నుంచి మాణిక్యంగాడికి డిమాండ్ల మీద డిమాండ్లు అందుతాయి. వాడు ప్రొడక్షన్ పెంచేస్తాడు. అప్పుడు మన మాణిక్యం మార్కెట్లో దిగుతుంది. అప్పటిదాకా మన గోడవున్లో వాడి సరుకుతోబాటే ఉప్పు బస్తాలు, ఏంటీ? ఉప్పు, ఉప్పు బస్తాలు కూడా ఉంటాయి. ఆ తర్వాత తమాషా చూడు'' అన్నాడు మరకతం.

పెద్దదిక్కుకి పూర్తిగా అనుమానం తొలగలేదు.

తొమ్మిది నెలలు నిండేసరికి మాణిక్యం మట్టిలో కలిసిపోయాడు. మరకతమొకడే మిగిలిపోయాడు.

అప్పటికి పెద్దదిక్కుకి అనుమానం తొలగిపోయింది. దాంతో నిద్రపట్టాలి. కానీ అతనికి నిద్రపట్టలేదు.

కొత్త అనుమానాలు మొదలయ్యాయి.

ఎక్కడయినా అంతర్జాతీయ మరకతం ఉన్నాడేమో!

ఈ జాతీయ మరకతం, జాతీయ మాణిక్యంగాళ్లని భోంచేయడానికి గోసాయి చిట్కాలు వాడి దగ్గర ఎన్నున్నాయో!

అప్పుడు ఈ జాతీయ మరకతాలేమవుతారో.

అలాంటి అనుమానాలతో పెద్దదిక్కు నిద్రకు వెలియై తానొంటరియై...

*(విపుల - మార్చి '94)*